
సాక్షి
శ్రీకాకుళం

శనివారం । 21 । సెప్టెంబర్ । 2024



దేవుడి సొమ్ముకు శఠగోపం

దేవుడి గుడిలో దొంగలు పడుతున్నారు. మారుమూల పల్లెల్లో చోరీలు చేస్తున్నారు.

- 8లో



జిల్లా వైద్యారోగ్య శాఖలో..

వైద్యారోగ్య శాఖలో ఉద్యోగాల పేరిట మోసం జరుగుతోంది. తాజాగా ఇది వెలుగుచూసింది.

- 8లో

ఎస్పీ గ్రీవెన్స్‌కి 16 ఫిర్యాదులు

కాశీబుగ్గ: కాశీబుగ్గ పోలీసు డివిజన్ కేంద్రం కాశీబుగ్గ పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహించగా మొత్తం 16 వినతులు వచ్చాయి. పలాస మండలం కిష్టుపురం గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త బూర్లె కృష్ణవేణి తనకు ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేశారు. అధికార పార్టీ నాయకులు తనపై దాడి చేశారని, తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

న్యూస్‌రీల్

ఖరీఫ్‌కు రూ.3500 కోట్ల రుణాలు



సమావేశంలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంకు మేనేజరు సూర్యకుమార్

పలాస: జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రూ.3500 కోట్ల రుణాలు మంజూరు చేశామని జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజరు ఎం.సూర్యకుమార్ చెప్పారు. పలాస మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వివిధ బ్యాంకు మేనేజర్లు, వ్యవసాయ శాఖ, వెలుగు, మెప్మా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో రూ.2099 కోట్లు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. జిల్లాలో 50వేల డ్వాక్రా సంఘాలు ఉండగా గత ఏడాది రూ.1200 కోట్లు రుణాలు ఇచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకోగా రూ.2200 కోట్ల రుణాలు మంజూరు చేశామన్నారు. ఈ ఏడాది రూ.2వేల కోట్లు మంజూరు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటి వరకు రూ.50 కోట్లు మంజూరు చేశామన్నారు. పీఎం విశ్వకర్మ పథకంలో భాగంగా 18 రకాల కుల వృత్తులకు రూ.లక్ష నుంచి రూ.3లక్షల వరకు రుణాలను అందజేశామన్నారు. ఇచ్చిన రుణాలకు కేవలం 5శాతం వడ్డీ మాత్రమే పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్‌నాయుడు, పంచాయితీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, వివిధ బ్యాంకుల మేనేజర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పుట్టపర్తి ప్రసాదానికి పలాస జీడిపప్పు



పలాస రైలు నిలయంలో జీడిపప్పుతో సత్యసాయి భక్తులు


కాశీబుగ్గ: అనంతపురం జిల్లా పుట్టపర్తి సత్యసాయి సన్నిధిలో ప్రసాదానికి పలాస జీడిపప్పును పంపించారు. పలాస సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏడాదికి సరిపడే జీడిపప్పును ఏటా పంపిస్తుంటారు. పలాస నుంచి పుట్టపర్తి చేరే విధంగా శుక్రవారం ఉదయం ప్రశాంతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో పలాస రైల్వేస్టేషన్ నుంచి పంపించారు. కార్యక్రమంలో పలాస సత్యసాయి సేవా సమితి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎటు చూసినా జ్వరాలే..

- మంచం పట్టిన జిల్లా
- ముందస్తు చర్యల్లో ప్రభుత్వం విఫలం
- రోగులతో కిక్కిరిసిపోతున్న ఆస్పత్రులు
- సాధారణ జ్వరాలకు తగ్గిపోతున్న ప్లేట్‌లెట్స్
- గుర్తించేలోపే విషమిస్తున్న ఆరోగ్యం
- చిన్న పిల్లల్లో దద్దుర్లు, కురుపులు
- వైరల్ ప్రభావం తీవ్రంగా ఉందంటున్న వైద్యులు



శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో..





సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

జిల్లాను జ్వరాలు పట్టిపీడిస్తున్నాయి. ఎక్కడ చూసినా, ఏ ఊరికి వెళ్లినా, ఏ ఆస్పత్రి పరిశీలించినా జ్వర పీడితులే కనిపిస్తున్నారు. గ్రామాల నుంచి నగరాల వరకు, పసి పిల్లల దగ్గరి నుంచి వృద్ధుల వరకు జ్వరాల బారిన పడుతున్నారు. ఎప్పుడూ లేని విధంగా ఈ సారి సాధారణ జ్వరాలే ప్రజల ప్రాణాలను తీసేస్తున్నాయి. వ్యాధి నిర్ధారణ చేసుకునేలోపు మృత్యువాత పడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి.

ఐదేళ్ల తర్వాత..

దాదాపు ఐదేళ్ల తర్వాత ఇదే ప్రమాదకర సీజన్‌గా వైద్య వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కరోనాకు ముందు ఎలాంటి పరిస్థితులుండేవో ఇప్పుడు అలాంటి పరిస్థితులు పునరావృతమైనట్టు వైద్యులు చెబుతున్నారు. కోవిడ్ తర్వాత ప్రజలు తీసుకున్న జాగ్రత్తలు, ప్రభుత్వ యంత్రాంగం తీసుకున్న చర్యలు కారణంగా 2020 తర్వాత జిల్లాలో జ్వరాల ప్రభావం పెద్దగా లేదు. ప్రజల జీవన శైలి మెరుగుపడటంతో పాటు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో చూపించిన శ్రద్ధ కారణంగా వైరస్‌లు పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. కానీ, ఈ సంవత్సరం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక పారిశుద్ధ్యాన్ని గాలికొదిలేయడం వల్ల ఎక్కడికక్కడ చెత్త నిల్వలు పేరుకుపోయాయి. దీంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ముందస్తు నివారణ చర్యలు తీసుకోవడంలోనూ ప్రభుత్వం విఫలమైంది. బ్లీచింగ్, నీటి క్లోరినేషన్ చేయకపోవడంతో పరిస్థితులు అధ్వానంగా తయారయ్యాయి. దీనికి తోడు ఇంటింటికీ వెళ్లి జ్వరపీడితులను గుర్తించి, సకాలంలో వారిని అప్రమత్తం చేసే చర్యలు కూడా తీసుకోలేదు. కనీసం జ్వరాలపై సమీక్షలు కూడా సరిగా జరగలేదు. వైద్యుల్ని, క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేసే పరిస్థితులు పెద్దగా లేవు.

లక్షల్లో జ్వర పీడితులు



జూలై నుంచి సెప్టెంబర్ 15 వరకు జిల్లాలో అధికారికంగా 2,11,825 మందికి జ్వరాలు వచ్చినట్టు లెక్కలు చెబుతున్నాయి. అధికారుల దృష్టికి రాని కేసులు అంతకు రెట్టింపు ఉన్నాయి. ఈ లెక్కన జిల్లాలో రెండున్నర నెలల్లో నాలుగైదు లక్షల మంది జ్వరం బారిన పడినట్టు తెలుస్తోంది. అదే సీజన్ మొత్తంగా తీసుకుంటే 6లక్షలకు పైగా జ్వరాల బారిన పడ్డట్టు అధికారిక లెక్కలు చెబుతుండగా, అధికారుల దృష్టికి రానివి మరో రెండు మూడు లక్షలు ఉండొచ్చని అంచనా. జూలై నుంచి సెప్టెంబర్ 15 వరకు 28మందికి మలేరియా, 37మందికి డెంగీ పాజిటివ్ వచ్చినట్టు అధికారుల నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇదిలా ఉండగా, వైరల్ జ్వరాలతో ఎనిమిది మంది చనిపోయినట్టు అధికారికంగా ధ్రువీకరించారు. వాస్తవానికి సాధారణ జ్వరాలతోపాటు డెంగీ, మలేరియా బారిన పడి మృతి చెందిన వారి సంఖ్య అధికంగా ఉన్నట్టు తెలుస్తోంది. ప్రైవేటు ఆస్పత్రులకెళ్లి సీరియస్ అయిన తర్వాత ఇంటికొచ్చి చనిపోయిన కేసులు లెక్కకు మించి ఉన్నాయి. ఇవేవీ రికార్డు కాలేదు. పెరుగుతున్న రద్దీకి ప్రభుత్వాస్పత్రుల్లో పడకలు కూడా సరిపోవడం లేదు.

ప్రమాదకరమే..

- ఒక ఆస్పత్రికి వచ్చే 100మంది రోగుల్లో 70శాతం మంది జ్వరాలతో బాధపడుతున్న వారే ఉంటున్నారు. పరీక్షలు చేసుకుంటే వారిలో చాలా వరకు ప్లేట్‌లెట్స్ తగ్గిపోయినట్టు ఫలితాలు వస్తున్నాయి. జ్వరం వచ్చిన ఒకటి రెండు రోజులకే ప్లేట్‌లెట్స్ పడిపోవడం ఈసారి ఎక్కువగా కనిపిస్తోంది. దీంతో జనం భయపడుతున్నారు.
- ఒకప్పుడు డెంగీ, సీరియస్ వైరల్ జ్వరాలకు మాత్రమే ప్లేట్‌లెట్స్ పడిపోయేవి. జ్వరం వచ్చి నాలుగైదు రోజుల తర్వాత సీరియస్ అయ్యేది. కానీ ఈ సీజన్‌లో జ్వరం వచ్చిన కొద్దిరోజులకే ప్లేట్‌లెట్స్ పడిపోతున్నాయి. అధిక జ్వరం, తలనొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. సాధారణంగా డెంగీ సోకిన రోగికి ఇలాంటి లక్షణాలు ఉంటాయి. కానీ, పరీక్షలు చేస్తుంటే మాత్రం డెంగీ లేకపోయినప్పటికీ ఆ లక్షణాలు మాత్రం బాధిస్తున్నాయి.





కొత్తూరు ఆస్పత్రిలో ఒకే మంచం పై ఇద్దరు రోగులకు వైద్యం అందిస్తున్న దృశ్యం



- అలాగే జ్వరాల బారిన పడిన వారికి చికున్ గున్యా తరహాలో శరీర నొప్పులు, కీళ్ల నొప్పులు తీవ్రంగా బాధిస్తున్నాయి. జ్వరం ఉన్నప్పుడు పెద్దగా ఇబ్బంది పెట్టకపోయినా తగ్గిపోయాక తీవ్రంగా ఇబ్బంది పడాల్సి వస్తోంది.
- ప్రస్తుతం జ్వరాల బారిన పడిన పిల్లలకు దద్దుర్లు, కురుపులు ఎక్కువగా వస్తున్నాయి. ముఖ్యంగా చిన్న పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. జ్వరాలు వస్తే దద్దుర్లు, కురుపులు రావడం ఇప్పుడే చూస్తున్నామని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు
- రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్న వారికి ప్రస్తుత జ్వరాలు మరింత ప్రమాదకరంగా మారాయి. వివిధ వ్యాధులతో బాధపడుతూ మందులు వాడుతున్న వారిని సాధారణ జ్వరం కూడా కబళిస్తోంది.

రోగులతో కిక్కిరిసిన కొత్తూరు సీహెచ్‌సీ

కొత్తూరు: కొత్తూరు మండలంలో జ్వరాలు పంజా విసిరాయి. స్థానిక సీహెచ్‌సీకి రోజుకు సుమారు 300 మంది వైద్యం కోసం వస్తుంటారు. అందులో సుమారు 150 మంది విష జ్వరాలు, టైఫాయిడ్, మలేరియాతో పాటు పలు రోగాలతో ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ఆస్పత్రిలో మంచాలు చాలక పోవడంతో ఒకే మంచం పై ఇద్దరు రోగులను ఉంచి వైద్యం అందిస్తున్నారు. కొత్తూరు, సిరుసువాడ, నివగాంలతో పాటు పలు గ్రామాల్లో జ్వరాలు ఎక్కువగా ఉన్నాయి. జ్వరాలు తగ్గకపోవడంతో కొంత మంది శ్రీకాకుళం వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు.



రోగులతో కిటికిటలాడుతున్న కొత్తూరు సీహెచ్‌సీ

వైరల్ ప్రభావం ఎక్కువే



ఈ సారి వైరల్ ప్రభావం ఎక్కువగా ఉంది. మా ఆస్పత్రికొచ్చే ఓపీలో 100 మందిలో 60 మంది జ్వరపీడితులే ఉంటున్నారు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవాళ్లు ఎఫెక్ట్ అవుతున్నారు. సకాలంలో వైద్యం తీసుకుంటే ఇబ్బంది లేదు. అలసత్వం వహిస్తే కేసులు సీరియస్ అవుతున్నాయి. వైరల్ జ్వరాలకు ప్లేట్‌లెట్స్ తగ్గిపోతాయి. జ్వరం తగ్గిన వెంటనే మళ్లీ ప్లేట్‌లెట్స్ పెరుగుతాయి. ఎలాంటి ఆందోళన చెందకుండా వైద్యం చేసుకుంటే సమస్య ఉండదు. కాకపోతే ఈసారి జ్వరాలు వచ్చిన వారికి చికున్ గున్యా తరహాలో బాడీ పెయిన్స్, కీళ్ల నొప్పులు వస్తున్నాయి. జ్వరాల కన్నా అవే ఎక్కువగా ఇబ్బంది పెడుతున్నాయి. మందులు వాడుకుంటే సరిపోతుంది.

– తమ్మినేని వేణుగోపాల్, ప్రముఖ వైద్యులు, అమృత హాస్పిటల్, శ్రీకాకుళం

దయనీయం



కొత్తూరు సీహెచ్‌సీలో ఒకే మంచంపై ఉన్న వృద్ధ దంపతులు నారాయణ, బుగతమ్మ

కొత్తూరు: కొత్తూరులో వృద్ధ దంపతులు ఆస్పత్రిలో రోజంతా భోజనం చేయకుండా దీనంగా గడిపిన ఘటన స్థానికులను కలిచివేసింది. వివరాల్లోకి వెళితే.. కొత్తూరు మండలం నివగాంకు చెందిన గొర్లె బుగతమ్మ, నారాయణలను ఈ నెల 19న వారి కుమారుడు కొత్తూరు సీహెచ్‌సీ వద్ద విడిచిపెట్టి వెళ్లిపోయాడు. అతను నిత్యం మందు మత్తులోనే ఉంటాడు. తల్లిదండ్రులను తీసుకువచ్చి ఆస్పత్రిలో ఓపీ కూడా తీయలేదు. ఓపీ తీయాలన్న సంగతి ఆ వృద్ధ దంపతులకు కూడా తెలీకపోవడంతో ఆస్పత్రిలోని ఒకే మంచంపై ఇద్దరూ గురువారం నుంచి శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఉన్నారు. నారాయణ కాలికి గాయాలై చీము పట్టి ఉంది. బుగతమ్మకు నడుం నొప్పి వస్తోంది. గురువారం రాత్రి అటుగా వచ్చిన డ్యూటీ డాక్టర్ వారి పరిస్థితి చూసి ఇంజెక్షన్ ఇచ్చారు. ఓపీ లేకపోవడం, ఎవరికీ సమాచారం లేకపోవడంతో వారిని ఎవరూ పట్టించుకోలేదు. దీంతో గురువారం నుంచి శుక్రవారం వరకు వారు కనీసం భోజనం కూడా చేయకుండా అక్కడే ఉండిపోయారు. వైద్యం కూడా అందలేదు. నిస్సహాయ స్థితిలో ఉన్న వారి గురించి 'సాక్షి' విలేకరికి తెలియడంతో విషయాన్ని డ్యూటీ డాక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అయితే అటెండెంట్ ఉంటే తప్ప వైద్యం అందించలేమని వైద్యులు చెప్పారు. చివరకు వృద్ధ దంపతుల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నూలు వీరభద్ర స్వామికి ఈ విషయాన్ని ఫోన్ ద్వారా చెప్పడంతో ఆయన వృద్ధుల కుమారుడికి కబురు పంపించారు. అలాగే ఈ విషయం ఆస్పత్రి సూపరింటెండెంట్ ధర్మాన కిశోర్ దృష్టికి రావడంతో ఆయన కూడా వెంటనే నివగాంలో ఉన్న కుమారుడిని పిలిపించి మెరుగైన వైద్యం అందించి నారాయణకు శ్రీకాకుళం రిఫర్ చేశారు. చికిత్స ప్రారంభించే ముందు కొత్తూరు ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు స్పందించి ఓపీ టిక్కెట్ తీసి దంపతులకు ఇచ్చి మానవత్వం చాటుకుంది.

టీచర్‌పై విచారణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు వై.వెంకటరమణపై వచ్చిన ఫిర్యాదులు, ఇతర అంశాలపై డిప్యూటీ డీఈఓ ఆర్.విజయకుమారి శుక్రవారం పాఠశాలలో విచారణ నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో వేర్వేరుగా సమావేశమై వారి నుంచి వివరాలు సేకరించారు. అలాగే గ్రామ పెద్దలు లక్ష్మణరావు, ఎల్లయ్య, స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ చైర్మన్ రవివర్మలతో చర్చించారు. జిల్లా విద్యా శాఖ అధికారికి నివేదిక అందజేయనున్నట్లు చెప్పారు.

క్రెడిట్ కార్డు మోసాలపై జాగ్రత్త



శ్రీకాకుళం క్రైమ్ : అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి మీ క్రెడిట్ కార్డుపై చార్జీలు పడతాయని లేదంటే బ్లాక్ అవుతుందని బెదిరించి మోసాలకు పాల్పడే అవకాశం ఉందని, జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసినా, మెసేజ్‌లు పంపినా స్పందించకూడదని, వ్యక్తిగత సమాచార గోప్యత పాటించాలని తెలిపారు. ఫోన్‌కు వచ్చే లింక్‌లు ఓపెన్ చేయకూడదని, ఆధార్, బ్యాంకు ఖాతాల సమాచారం, క్రెడిట్/డెబిట్ కార్డు / బ్యాంకు ఖాతా నంబర్, యూపీఐ పిన్, ఓటీపీ, సీవీవీ (కార్డ్ వెరిఫికేషన్ వాల్యూ) నంబర్, ఎక్స్‌పైరీ డేట్ తదితర వివరాలు ఎవరికీ చెప్పకూడదన్నారు. ఎవరైనా మోసపోతే 1930 నంబర్‌కు కాల్ చేయాలని, లేదంటే నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్‌క్రైమ్.జీఓవీ.ఇన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు.

ఈసీసీఈ డిప్లమా కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో విద్యా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరు నెలల డిప్లమా కోర్సు ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ)లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ పి.సుజాత శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆరు నెలల కోర్సు ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. వర్సిటీ వెబ్ సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. బీఆర్ఏయూ.ఈడీయు.ఇన్‌లో దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని, రూ.250 ఫీజు చెల్లించాలని చెప్పారు. ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు విద్యా విభాగాన్ని సంప్రదించాలని సూచించారు.

కలశ కళ



శ్రీకాకుళంలోని మొండేటివీధిలో లక్ష్మీ గణపతి ఆలయం ప్రతిష్టించి పుష్కర కాలం పూర్తయిన సందర్భంగా సహస్ర కలశార్చనలు జరిగాయి. మూడు రోజుల పాటు మహా కుంభాభిషేక ఉత్సవాలు నిర్వహించనున్నారు. – శ్రీకాకుళం కల్చరల్

వంద రోజుల పాలనంతా వంచనే

- చంద్రబాబువి అన్నీ అబద్ధాలు, ఆర్భాటాలే
- ప్రజలకు ఏం చెప్పాలో తెలీకనే రాజపురం సభకు డుమ్మా
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



కృష్ణదాస్‌ను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పోలాకి: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వంద రోజుల్లో ప్రజలకు చేసిందేమీ లేదని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆయన శుక్రవారం మబగాంలోని ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబువి అన్నీ అబద్ధాలు, ఆర్భాటాలేనని మండిపడ్డారు. ప్రజలకు ఏం చెప్పాలో తెలియక రాజపురం సభకు డుమ్మా కొట్టారని, వాతావరణం కారణం కానే కాదని అన్నారు. జగన్ హయాంలోనే నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత తగ్గిస్తామన్న టీడీపీ నాయకులకు ధరలు తగ్గించేందుకు వందరోజులు సరిపోలేదా..? అని ఎద్దేవా చేశారు. ఏ నియోజకవర్గంలో చూసినా అధికార పార్టీ నాయకుల అరాచకాలు, వాటికి వత్తాసు పలికిన పోలీసుల వైఫల్యాలు, పేద, బడుగు వర్గాల ఆవేదనలే కనబడుతున్నాయని అన్నారు. సూపర్‌సిక్స్ అమలు చేసి ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలుచేయాలని కోరారు. జిల్లాలో అత్యధికంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు వైద్య చదువులు దూరం చేసిన ఘనత ఈ వందరోజుల ప్రభుత్వానిదేనని దుమ్మెత్తిపోశారు. వలంటీర్ల తొలగింపు, మద్యం దందా కొనసాగింపు, ఇసుక అక్రమరవాణా, పెరిగిన డ్రగ్స్ వినియోగం, నిరుద్యోగ యువకుల ఆవేదనలు, అన్నదాతల ఆవేదనలు వంటి వాటికి వందరోజుల ప్రభుత్వం బాధ్యత వహించాలని కృష్ణదాస్ అన్నారు.

కృష్ణదాస్‌కు అభినందనలు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షునిగా వరుసగా మూడోసారి నియమితులైన మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్‌కు పార్టీ శ్రేణులు, నాయకుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం మబగాంలోని ఆయన నివాసంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు కలుసుకున్నారు. ఈసందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ జిల్లాలో వైఎస్సార్‌సీపీని ముందుండి నడిపించేందుకు మరోసారి అవకాశం కల్పించిన జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మళ్లీ ప్రజల మద్దతుతో అధికారంలోకి వస్తామని అన్నారు. కృష్ణదాస్‌ను అభినందించిన వారిలో అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, రాజాపు అప్పన్న, చింతాడ రవికుమార్, పోలాకి ఎంపీపీ ముద్దాడ భైరాగినాయుడు, కణితి కృష్ణారావు, చింతాడ ఉమ, భావన వైకుంఠరావు ఉన్నారు.

అన్ని హామీలు నెరవేరుస్తాం

- రాజపురంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

కవిటి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశల వారీగా నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. మండలంలోని రాజపురంలో శుక్రవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామ్యం కావడం కేంద్ర విమానయాన శాఖ మంత్రిగా అవకాశం లభించడం వల్ల జిల్లాలో విమానాశ్రయాన్ని ఏర్పాటు చేసుకోవాలనే ఆలోచన ఉన్నట్టు వెల్లడించారు. ఈ మేరకు బాబాయ్ అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తో కలిసి టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం పరిసర ప్రాంతాల్లో భూమిని గుర్తించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాకు పరిశ్రమలను తీసుకువచ్చి నిరుద్యోగ సమస్య లేకుండా చూస్తామన్నారు. పోర్టు పనులు వేగంగా పూర్తి చేస్తామని, తద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. భోగాపురం విమానాశ్రయం ద్వారా విజయనగరం, శ్రీకాకుళం జిల్లా నిరుద్యోగులకు అవకాశాలను కల్పిస్తామని చెప్పారు.

అంతకుముందు మాట్లాడిన వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు గత ప్రభుత్వాన్ని నిందించడమే పనిగా పెట్టుకోవడం తప్ప వందరోజుల్లో ఏం చేశారో చెప్పలేకపోయారు. ఇటీవల జరిగిన కేబినెట్ భేటీలో దీపావళి నుంచి ఫ్రీ గ్యాస్ అందించాలని సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అయితే కేవలం ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించేందుకే ఈ సమావేశాన్ని అధికార పార్టీ నేతలు వేదికగా చేసుకున్నారనే విమర్శలు ప్రజల నుంచి వినిపించాయి. కార్యక్రమంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, పలాస ఆర్డీఓ భరత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐటీఐల్లో నాలుగో విడత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో మిగులు సీట్లకు నాలుగో విడత ప్రవేశాలు కల్పించనున్నట్లు ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా ప్రవేశాల కన్వీనర్ ఎల్.సుధాకర్‌రావు తెలిపారు. ఎచ్చెర్ల ఐటీఐలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్‌లో ఆన్‌లైన్‌లో ఈ నెల 26వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపిక చేసుకున్న ఐటీఐకి దరఖాస్తు చేసుకుని, దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకోవాలని అన్నారు. అనంతరం ప్రభుత్వ ఐటీఐలో వెరిఫికేషన్ చేసుకోవాలని, ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న ఐటీఐకి 28న వెళ్లి ప్రవేశం పొందాలని చెప్పారు. విద్యార్థులు అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

హిరమండలం: ఎన్నికల ముందు వంశధార నిర్వాసితులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నెరవేర్చాలని నిర్వాసితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గంగరావు సింహాచలం డిమాండ్ చేశారు. హిరమండలంలో ఆ సంఘ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయినా స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు జిల్లాకు చెందిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గానీ నిర్వాసితుల సమస్యలపై ప్రస్తావన చేయలేదన్నారు. సీఎం నిర్వాసితులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు.

వెంకటేశ్వర, శివానీ ఫార్మశీ కాలేజీలకు సీఎస్సీ గుర్తింపు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఫార్మశీ కాలేజ్, చిలకపాలేంలోని శ్రీ శివానీ కాలేజ్ ఆఫ్ ఫార్మశీలకు కౌన్సెల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్సిస్ (సీఎస్సీ) గుర్తింపు లభించాయి. ఈ మేరకు ధ్రువీకరణ పత్రాలు శుక్రవారం కాలేజ్ మేనేజ్‌మెంట్‌లు అందుకున్నాయి. ఉత్తమ విద్యా ప్రమాణాల ఆధారంగా ఈ విద్యా సంస్థలకు ఎంపిక చేసినట్లు సీఎస్సీ ప్రతినిధి వై.రామ్మోహన్ చెప్పారు. ఈ కార్యక్రమాల్లో కళాశాల అకడమిక్ సిబ్బంది, మేనేజ్ మెంట్ సభ్యులు పాల్గొన్నారు.

240 లీటర్ల నాటుసారా స్వాధీనం



నాటుసారాతో పాటు వాహనాన్ని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతం తూటుపురం ఒడిశా గ్రామం నుంచి అక్రమంగా నాటుసారాను ఆంధ్రాకు తరలిస్తున్న వాహనాన్ని అదుపులోకి తీసుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఎం.విజయలక్ష్మీ తెలిపారు. కవిటి మండలం జాడుపూడి గ్రామానికి టాటా ఏసీ వాహనంపై 240 లీటర్లు నాటుసారాను తీసుకొని వెళ్తుండగా జంక్షన్ వద్ద పట్టుకోవడం జరిగిందని, ఈ సందర్భంగా ఒక వ్యక్తి పరాయి కావడంతో డ్రైవర్ యోగిని, వాహనాన్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని తెలిపారు.

'సమాచారం' కావాలంటూ..

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాయానికి సమాచార హక్కు చట్టం కింద వస్తున్న దరఖాస్తుల సంఖ్య పెరుగుతోంది. దీంతో సమాచారం ఇచ్చేందుకు పాట్లు పడుతున్నారు. కొన్ని దరఖాస్తులకు న్యాయ నిపుణుల సలహాలు పాటిస్తున్నారు. వర్సిటీలో వర్గాలు కొనసాగటం కూడా సమాచారం హక్కు దరఖాస్తుల సంఖ్య పెరగటానికి కారణమని భావిస్తున్నారు. ప్రధానంగా ఒక అధికారి విశాఖ నుంచి రోజూ విశ్వవిద్యాలయానికి రావడానికి ప్రభుత్వ కారు వాడుతున్నారని, దీనికి సంబంధించిన నిబంధనలపై, అలాగే ఒకరికి టీచింగ్ అసోసియేట్ నుంచి కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డిజిగ్నేషన్ ఇవ్వటం, ప్రస్తుత అధికారులు చేపట్టిన నియామకాలు వివరాలు, నిబంధనలు, కాంట్రాక్టు అధికారుల నియామక నిబంధనలు వంటి అంశాలపై ఎక్కువగా దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం.

జూనియర్ లైన్‌మెన్ ఆత్మహత్య



మృతి చెందిన శంకరరావు

నందిగాం: మండలంలోని రధజనబొడ్డపాడు సచివాలయంలో జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న మొగలిపాటి శంకరరావు(39) శుక్రవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శంకరరావు తన స్వగ్రామమైన రధజనబొడ్డపాడు పంచాయతీ బెల్లకోల గ్రామంలో ఇటీవల సొంత ఇంటిని నిర్మించుకున్నాడు. దాని కోసం వివిధ ఫైనాన్స్ సంస్థల వద్ద భారీగా అప్పు చేశాడు. ఆరు నెలల కిందట భార్య అనూష, కుమారుడు పార్థసారధితో కలిసి కొత్త ఇంటిలో గృహప్రవేశం కూడా చేశాడు. అయితే అప్పుల వారు నిత్యం అడుగుతుండడంతో ఏం చేయాలో పాలుపోక వారం నుంచి ఇంట్లో దిగాలుగా ఉన్నాడు. భార్య ధైర్యం చెప్పినప్పటికీ.. శుక్రవారం ఉదయం 9.30కు భార్య బట్టలు ఉతకడానికి వెళ్లిన సమయంలో ఇంటిలోని వంటగదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. ముందు గదిలో టీవీ చూస్తున్న కుమారుడు గమనించి తల్లిని పిలిచి చెప్పడంతో.. ఇరుగుపొరుగు వారు వచ్చి దించే సరికే అతను చనిపోయాడు. అయినప్పటికీ టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. భార్య ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్ఐ షేక్ మహమ్మద్ ఆలీ కేసు నమోదు చేశారు.

దేవుడి సొమ్ముకు శఠగోపం





ఫరీదుపేట రంగనాథ స్వామి ఆలయంలో..



కుంచాలకూర్మయ్య పేటలోని దుర్గమ్మ ఆలయంలో..

- మారుమూల ఆలయాలే లక్ష్యంగా దొంగతనాలు
- వరుస చోరీలతో బెంబేలెత్తిస్తున్న చోరులు
- రూ.లక్షలు విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలే కాక హుండీల్లో సొమ్ము మాయం చేస్తున్న వైనం

శ్రీకాకుళం క్రైమ్ :

మొన్నటికి మొన్న కుంచాల కూర్మయ్యపేట, నిన్నటికి నిన్న ఫరీదుపేట, ఆ తర్వాత నందివాడ.. జిల్లాలో వరుసపెట్టి ఆలయాల్లో దొంగతనాలు జరుగుతున్నాయి. అది కూడా మారుమూల పల్లెల్లో ఉన్న ఆలయాలను టార్గెట్ చేసి మరీ హుండీలను కొల్లగొడుతున్నారు. దేవుడి నగలతో పాటు హుండీల్లోని నగదును దోచుకుంటున్నారు. ఈ దొంగతనాలు చేస్తున్నదెవరో ఇప్పటివరకు తేలకపోవడంతో పోలీసులు విచారణ వేగాన్ని పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

చోరీలివే..

- ఏప్రిల్ 24న ఎచ్చెర్ల మండలం దోమాం పంచాయతీ కుంచాల కూర్మయ్యపేట దేవీ పీఠంలోని రాజరాజేశ్వరి ఆలయంలో అర్ధరాత్రి దొంగలు ప్రవేశించారు. ఇనుప గేట్ల తాళాలను ధ్వంసం చేసి లోపలకు జొరబడ్డారు. సుమారు 30 తులాలకు పైగా అమ్మవారి బంగారు ఆభరణాలు, 15 తులాలకు పైగా వెండి, రూ.11 లక్షలు ఉండే నగదు బ్యాగును ఖాళీ చేసినట్లు ఆలయ అర్చకులు బాల భాస్కర శర్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెళ్తూ వెళ్తూ గుడి లోపల ఉన్న సీసీ ఫుటేజీ హార్డ్ డిస్క్, డీవీఆర్ కోసుకుని పట్టుకుపోయారు. కానీ ఇక్క డ పేర్కొన్నదాని కంటే ఎక్కువగానే వస్తువులు, నగదు పోయినట్లు సమాచారం. ఈ కేసులో ఇప్పటికీ ఎలాంటి పురోగతి లేదు.
- ఈ నెల 9న రాత్రి ఇదే కుంచాల కూర్మయ్యపేట దుర్గాదేవి ఆలయంలో తాళాలు పగలగొట్టి అమ్మవారికి అలంకరించిన ఆరు కిలోల వెండి, తులం బంగారం పట్టుకుపోయారు. ఇక్కడ కూడా చోరీ సొత్తు ఎక్కువే అని ప్రజలు అంటుండటం విశేషం.
- ఇదే ఎచ్చెర్ల మండలం ఫరీదుపేట గ్రామంలో గల రంగనాథ స్వామి ఆలయంలో ఈ నెల 14న రాత్రి గడియలు పగులగొట్టి, తలుపులు తెరిచి, గర్భగుడి తలుపుల తాళాలను విరగ్గొట్టారు. రెండు హుండీలు ధ్వంసం చేసి నాలుగు తులాల బంగారం, ఆరు కిలోల వెండి వస్తువులు చోరీ చేశారు. నగదు పోయినట్లు స్థానికులు చెబుతున్నారు.
- ఇదే ఎచ్చెర్ల మండలం తమ్మినాయుడుపేట లలితా త్రిపుర సుందరి ఆలయంలో ఏడు తులాల బంగారు ఆభరణాలు, 30 కిలోల వెండి పోయి ఏడాది కావస్తున్నా ఇప్పటికీ పోలీసులు రికవరీ చేయలేకపోయారు.
- ఈ నెల 16న అర్ధరాత్రి పొందూరు మండలం నందివాడ బాలయోగి ఆశ్రమంలో ఎనిమిది కిలోల వెండి, రెండు తులాల బంగారు ఆభరణాలతో పాటు హుండీలో ఉన్న రూ.లక్షకు పైగా నగదు మాయం చేశారు.

కొరవడిన పోలీసుల నిఘా..

ఈ చోరీ జరిగిన ఆలయాలు దాదాపు మారుమూల ఉన్నవే. చోరీలు జరిగాక పోలీసులు వెళ్లి పరిశీలించినా ఇంతవరకు చోరీ జరిగిన సొత్తు రికవరీ చేయడంలో గానీ, నేరస్తులను పట్టుకోవడంలో గానీ ఎక్కడా ఖాకీలు సక్సెస్ కాలేకపోయారు. ఇటీవల టెక్కలిలో వరుసగా దొంగతనాలకు పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠాను గత నెల 20న పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. వీరికి సంబంధించిన ఇతర గ్యాంగు సభ్యులేమైనా ఈ చోరీలకు పాల్పడుతున్నారేమోనన్న అనుమానం పోలీసుల్లో ఉంది.

గుర్తించాం.. పట్టుకుంటాం



ఆలయాల్లో దొంగతనాలకు సంబంధించి నలుగురిని ఇప్పటికే గుర్తించాం. త్వరలో పట్టుకుంటాం. ఇప్పటికే ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. గతంలో జరిగిన ఇలాంటి నేరాల్లో చోరులు దొరక్కపోవడంపై అనాలసిస్ చేస్తున్నాం. ప్రజలు కూడా అపరిచిత వ్యక్తులు తారసపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. గుడి నిర్వాహకులు రాత్రి సెక్యూరిటీ ఉండేలా చూసుకోవాలి. కచ్చితంగా సీసీ కెమెరాలుండాలి. రాత్రి సమయాల్లో విలువైన ఆభరణాలు అర్చకులు, లేదా నిర్వాహకులు వద్ద ఉంచాలి.

– కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్పీ, శ్రీకాకుళం

● ప్రభాసూ.. బడికి రా బాసూ



ఇక్కడ గొర్రెలు కాసే పనిలో ఉన్న పిల్లాడి పేరు నర్తు ప్రభాస్. కొళిగాం ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. కొన్ని రోజులుగా బడికి రావడం లేదు. ఎందుకా అని హెచ్ఎం నరేంద్ర నాథ్ పట్నాయక్ ఆరా తీస్తే ప్రభాస్ తల్లిదండ్రులు అతడిని గొర్రెలు కాసేందుకు పంపిస్తున్నట్లు తెలిసింది. దీంతో ఆయన శుక్రవారం స్వయంగా వెళ్లి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి విద్యార్థిని బడికి పంపించేందుకు ఒప్పించారు. – ఇచ్ఛాపురం రూరల్

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుని ఇంటిపై దాడి



ఖగేశ్వరరావు ఇంటిపై మారణాయుధాలతో దాడిచేస్తున్న టీడీపీ కార్యకర్తలు

కంచిలి: మండలంలోని మండపల్లి పంచాయతీ పరిధి ఒరియా నారాయణపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు బడియా ఖగేశ్వరరావు ఇంటిపై టీడీపీకి చెందిన పలువురు శుక్రవారం దాడి చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 5 సార్లు ఖగేశ్వరరావు ఆస్తులపైన, వ్యక్తిగతంగా ఘర్షణలకు దిగారు. చివరిగా శుక్రవారం ఉదయం పక్కింటికి, తన ఇంటికి మధ్య ఉన్న ఖాళీ స్థలంలో కొయ్యలు పాతినవి, వారు తొలగించి గొడవకు దిగారని, దాడి చేయబోగా భయపడి ఇంటిలోకి పరిగెత్తడంతో, వెంబడించి ఇంటి మీదకు వచ్చి కత్తులు, కర్రలు వంటి మారణాయుధాలతో తలుపులు పగులగొట్టి ప్రవేశించారని బాధితుడు తెలిపారు. ఇంట్లో ఫర్నీచర్ అంతా ధ్వంసం చేశారని, ఒక దశలో కిరోసిన్ చేతపట్టుకొని ఒంటిపైన వేసి చంపుతామని కూడా బెదిరించారని బాధితుడు ఖగేశ్వరరావు తెలిపారు. తన ఇంటిపైన సత్త త్రినాథ్, భార్య, ఆశ వర్కర్ నీలవేణి, సత్త గుణ, జన్ని గుణ, జన్ని దమయంతి, బి.గొంగ, పాడియా సహదేవ్, పాడియా భాస్కర్, భంసిన బుద్ధి, కొనక గీత తదితరులు దాడి చేశారని ఆరోపించారు. కంచిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

13 తులాల బంగారం.. కిలో వెండి చోరీ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని పీఎన్‌కాలనీ మూడోలైన్, పదోలైన్‌లలో బుధవారం రాత్రి ఇద్దరు ఉపాధ్యాయుల ఇళ్లలో చోరీలు జరిగిన సంగతి తెలిసిందే. పదోలైన్‌లో నివాసముంటున్న ఉపాధ్యాయ దంపతులైన కె.రామ్మూర్తి, రమాదేవిల ఇంట్లో సుమారు 13 తులాల బంగారం వస్తువులు, కిలో వెండి వస్తువులు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు రామ్మూర్తి శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు సీఐ చెప్పారు. అయితే పీఎన్‌కాలనీలో నివాసముంటున్న ప్రజల ఇళ్లల్లో సీసీ కెమెరాలున్నా సరిగా మెయింటైన్ చేయకపోవడం, చోరీ జరిగిన ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలకు ఎక్కువగా చెట్ల పొదలు అడ్డురావడంతో ఫుటేజీలో నిక్షిప్తమవ్వడం లేదని పోలీసులు అంటున్నారు.

తాము ఏర్పాటు చేసిన కెమెరాలు వీధి చివర్లో ఉండటం, అనేక మార్గాలుండటం వారికి ఈజీ అవుతుందంటున్నారు. ప్రజలు ఇప్పటికైనా చోరీలపై అప్రమత్తంగా ఉండి క్యాంపులకు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ ఉమామహేశ్వరరావు సూచించారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

- పరారీలో మరో ఇద్దరు వ్యక్తులు
- కారు, 64 కేజీల గంజాయి స్వాధీనం

దేవరాపల్లి (అనకాపల్లి జిల్లా): ఏజెన్సీ నుంచి కారులో అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు నిందితులను ఎస్ఐ టి.మల్లేశ్వరరావు పట్టుకున్నారు. దేవరాపల్లి మీదుగా గంజాయి అక్రమంగా తరలిస్తున్నట్లు ముందస్తు సమాచారం మేరకు గురువారం సాయంత్రం శ్రీరాంపురం వై జంక్షన్ వద్ద ఎస్ఐ తన సిబ్బంది కలిసి కాపు కాశారు. కారులో తరలిస్తున్న 64 కిలోల గంజాయితో పాటు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ వెల్లడించిన వివరాల ప్రకారం.. గంజాయితో పట్టుబడిన వారిలో ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా పనసపుట్టు పంచాయతీ శివారు జామిగుడ గ్రామానికి చెందిన కొర్రా రంజు, కొర్రా అర్జున్‌తో పాటు పెద బయలకు చెందిన కారు డ్రైవర్ కూడ కార్తీక్ ఉన్నారు. వీరి ముగ్గురిని అరెస్టు చేసి చోడవరం కోర్టుకు తరలించారు. పట్టుబడిన వారిలో రంజు, అర్జున్ గంజాయి పండిస్తున్నారు. వారి దగ్గర నుంచి కారు యజమానులైన ఒడిశాకు చెందిన గుంజా గోపి, హుకుంపేట మండలం గన్నెలపూట్‌కు చెందిన కొర్ర శివ కలిసి కొనుగోలు చేసిన 64 కేజీల గంజాయితో కారులో నలుగురు బయలుదేరారు. పెదబయలుకు రాగానే కారు యజమానులు ఇద్దరూ కారును అదే గ్రామానికి చెందిన కూడ కార్తీక్‌కు అప్పగించారు.

కారులో గంజాయిని దేవరాపల్లి మీదుగా విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకుంటే, అక్కడికి తామిద్దరం వస్తామని చెప్పి కారు యజమానులు ఇద్దరు దిగిపోయారు. దీనిపై పక్కా సమాచారంతో శ్రీరాంపురం వై జంక్షన్ వద్ద స్థానిక పోలీసులు మాటు వేసి పట్టుకున్నారు. కారు యజమానులు ఇద్దరు పరారీలో ఉన్నారని, కారును సీజ్ చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ ఎంపికలకు సన్నద్ధం

- రేపటి నుంచి ఎంపిక పోటీలు
- మలివిడత తుది షెడ్యూల్‌ను ప్రకటించిన జిల్లా స్కూల్‌గేమ్స్ అధికారులు
- 30 వరకు నిర్విరామంగా కొనసాగనున్న జిల్లాస్థాయి ఎంపికలు



సాఫ్ట్‌బాల్ శిక్షణలో నిమగ్నమైన క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ:

పాఠశాలల క్రీడల (స్కూల్‌గేమ్స్) ఎంపిక పోరుకు సర్వం సిద్ధమైంది. జిల్లా విద్యాశాఖ పరిధిలోని పాఠశాల క్రీడల సమాఖ్య (స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో శనివారం నుంచి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ప్రాతిపదికగా జరగనున్న మలివిడత స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే స్కూల్‌గేమ్స్ పోటీలకు కనీస నిధులను విదల్చకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తున్నప్పటికీ.. అధికారులు, వ్యాయామోపాధ్యాయులు మాత్రం తమ సొంత ఖర్చుతో ఈ క్రీడలను నిర్వహిస్తున్నారు.

మండల, నియోజకవర్గాల్లో రాణిస్తే..

జిల్లాలో మండల స్థాయి ఎంపిక పోటీలు చురుగ్గా జరుగుతున్నాయి. ఇక్కడి నుంచి నియోజకవర్గ స్థాయికి, అక్కడి నుంచి జిల్లాస్థాయికి వెళ్తారు. జిల్లా స్థాయిలో జరిగే అండర్–14,17,19 బాలబాలికల ఎంపిక పోటీల షెడ్యూల్‌ను జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు, డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, కార్యదర్శి బడి వెంకటరమణ వెల్లడించారు. వివరాల కోసం ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ (సెల్: 94415 69785)ను సంప్రదించాలన్నారు.

మలి విడత షెడ్యూల్ ఇదే..

22వ తేదీన బాక్సింగ్: అండర్ 14,17,19 బాలబాలికలు కేఆర్ స్టేడియం శ్రీకాకుళం వేదిక.
23వ తేదీన స్విమ్మింగ్: అండర్ 14,17,19 బాలబాలికలకు శ్రీకాకుళం శాంతినగర్‌కాలనీ స్విమ్మింగ్ పూల్ వేదిక.
తైక్వాండో, ఫెన్సింగ్: టౌన్ హాల్ శ్రీకాకుళం.
టెన్నికాయిట్: పలాసలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదిక.
24వ తేదీన చెస్: అండర్ 14 బాలబాలికలు, 17,19 బాలికలకు ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదిక. **25న చెస్:** అండర్ 17, 19 బాలురుకు ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదిక.
26న అథ్లెటిక్స్, క్రికెట్: అండర్ 14, 17, 19 బాలబాలికలకు శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానం వేదిక.
27న కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్: అండర్–14,17,19 బాలురుకు శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానం వేదిక. అదేరోజు హాకీ అండర్ 14,17,19 బాలబాలికలకు ఆర్ట్స్ కళాశాల మైదానంలోనే ఎంపికలు జరుగుతాయి.
28వ తేదీన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్: అండర్–14,17,19 బాలికలకు శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానం వేదిక.
29న బేస్‌బాల్, స్కేటింగ్ : అండర్ 14,17,19 బాలబాలికలకు శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానం వేదిక.
ఈ నెల 30వ తేదీన వివిధ వేదికలుగా పలు క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు జరుగుతాయి.

పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు

నరసన్నపేట: స్థానిక పోలీస్‌స్టేషన్ భవనం శిథిలావస్థకు చేరుకుందని, దీని స్థానంలో నూతన భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తున్నామని ఎస్పీ మహేంద్ర రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. నరసన్నపేట స్టేషన్ భవనం నిర్మించి చాలా కాలమైందని చెప్పారు. సంబంధిత ఇంజినీర్లు కూడా పరిశీలిస్తారని తెలిపారు. ఫిర్యాదులు ఇచ్చేందుకు వచ్చిన వారికి అవసరమైన సహకారం ఇవ్వాలని సీఐ శ్రీనివాస రావు, ఎస్ఐ దుర్గాప్రసాద్‌లకు ఆదేశించారు.

గుట్టుచప్పుడు కాకుండా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు

కాశీబుగ్గ: జంట పట్టణాలలో గుట్టుచప్పుడు కాకుండా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ముందుగా సెకండ్‌కేటగిరీలకు చెందిన మీటర్ల స్థానంలో ఏర్పాటు చేస్తున్నారు. అనంతరం అందరి ఇళ్లకు ఈ మీటర్లు పెట్టడానికి చర్యలు చేపడుతున్నారు. ముందస్తుగా మీటరుపై ఉండే స్కానర్‌తో రీచార్జ్ చేసుకుని వాడుకోవాలని, అనంతరం బ్యాలెన్సు దగ్గర పడేసరికి హెచ్చరిక శబ్దం చేస్తుందని అప్పుడు తిరిగి రీచార్జ్ చేసుకుంటే విద్యుత్ వస్తుందని లేకుంటే సరఫరా నిలుస్తుందని వివరిస్తున్నారు. అయితే విద్యుత్ శాఖపై ఆధారపడి అనేక మంది ఉద్యోగులు, ఉపాధి పొందుతుండటంతో వారంతా ఆవేదనలతో నిరసనలు చేపడుతున్నారు. ప్రభుత్వం వారికి ఉపాధి మార్గం చూపకుండా ఇలా రహస్యంగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం ఏమిటని సీపీఐ నాయకులు చాపర వేణుగోపాల్ ఆరోపిస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

కంచిలి: సోంపేట రైల్వేస్టేషన్‌లో ట్రాక్ పైన ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొని చనిపోయాడు. మృతుని వయసు 50–55 ఏళ్లు ఉంటుంది. ఇచ్ఛాపురం నుంచి పలాస వైపు వెళ్లే ట్రాక్ మీద మృతదేహాన్ని స్టేషన్ యాజమాన్యం గుర్తించి, పలాస జీఆర్పీ స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో హెచ్‌సీ హరినాథ్ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తే 9440627567 నంబర్‌ను సంప్రదించాలని హెచ్‌సీ ఒక ప్రకటనలో తెలిపారు.

వైద్య శాఖలో ఉద్యోగాల పేరిట మోసాలు



- కీలక ఉద్యోగి చుట్టూ ప్రత్యేక కోటరీ
- ఆ కోటరీ మోసానికి ఓ మహిళ ఆత్మహత్యాయత్నం
- మాకివలస పీహెచ్‌సీ కాంట్రాక్ట్ ఉద్యోగిపై ఫిర్యాదు



అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖలో ఉద్యోగాల పేరిట మోసాలు జరిగిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. శుక్రవారం వెలుగులోకి వచ్చిన వ్యవహారం జిల్లా వైద్యశాఖలో తీవ్ర చర్చనీయాంశమైంది. వైద్య శాఖలో ఉద్యోగమిప్పిస్తామంటూ స్థానిక కంపోస్టు కాలనీకి చెందిన ఓ మహిళ నుంచి వైద్యశాఖకు చెందిన ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి రూ.లక్షల్లో డబ్బును తీసుకుని అటు ఉద్యోగం ఇవ్వక ఇటు తీసుకున్న డబ్బులు తిరిగి కట్టకపోవడంతో తీవ్ర మనో వేదనతో ఆ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో ఒక్కసారిగా జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కార్యాలయం ఉలిక్కిపడింది. జిల్లా శాఖ కార్యాలయంలో ఓ కీలక ఉద్యోగి అంతా తానై ఇలాంటి అక్రమ వ్యవహారాలను నడిపిస్తూ.. ఇందుకు సహాయకారులుగా జిల్లా నలుమూలల్లో వివిధ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులను కోటరీగా నియమించుకున్నారని తెలుస్తోంది. వీరి ద్వారా ఆశావహుల నుంచి డబ్బులు వసూలు చేస్తూ ఇప్పటికే 30 నుంచి 40 మందిని మోసం చేసినట్లు సమాచారం. తాజాగా మాకివలస పీహెచ్‌సీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగి చేసిన ఈ నిర్వాకంపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం మరింత రాజుకుంది.

పోస్టుల పేరిట వసూళ్లు

జిల్లా వైద్యారోగ్య శాఖలో సుమారు 3 వేల వరకు వివిధ రకాల పోస్టులను గత ప్రభుత్వ హయాంలో భర్తీ చేసినా చిన్న ఆరోపణ కూడా రాలేదు. అయితే కొందరు సిబ్బంది మాత్రం ఆశావహుల నుంచి అక్రమంగా ఒక్కో పోస్టుకు రూ.2లక్షల నుంచి రూ.3 లక్షల వరకు డబ్బులు తీసుకుని మోసం చేశారు. ఇదే క్రమంలో తాజాగా కొన్ని ఉద్యోగ నోటిఫికేషన్లకు కోర్టు పెండింగ్ అడ్డంకులు తొలగిపోయి భర్తీకి గ్రీన్‌సిగ్నల్ రావడంతో అప్పట్లో డబ్బులిచ్చిన వారి నుంచి అక్రమార్కులపై ఒత్తిడి పెరిగింది. దీంతో చేసేదేమీ లేక రేపు..ఎల్లుండి అంటూ దాటవేశారు. కొందరికైతే ఇవ్వమంటూ తెగేసి చెప్పేశారు. ఈ క్రమంలో తాము మోసపోయామని భావించిన కొందరు బాధితులు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడుతున్నారు. తాజాగా నగరంలో జరిగిన ఈ ఘటనతో మరోసారి వైద్యశాఖ వివాదాలు రోడ్డెక్కాయి. ఈ వివాదంపై ఉన్నతాధికారులు ఇప్పటికైనా విచారణ కమిటీని నియమించి విచారిస్తే అసలు నిందితులు బయటపడే అవకాశాలున్నాయని అంటున్నారు.

మోసాలే ఉద్యోగ విధులు

జిల్లా వైద్యారోగ్య శాఖలో ఉన్న అన్ని విభాగాల్లో సుమారు 20 మంది వరకు ఉద్యోగులు ఎలాంటి పనులు లేకుండా నిత్యం ఇలాంటి అక్రమ వ్యవహారాల పనుల్లోనే ఉంటారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు ఉద్యోగ సంఘాల పేరిట, కొందరు కులాల పేరిట, మరికొందరు అధికార పార్టీ పేరుతో స్థానికంగా ఆధిపత్యం కోసం హడావుడి చేస్తుంటారు. ఇలాంటి వ్యవహారాలకు కేంద్ర బిందువుగా కీలక ఉద్యోగి ఒకరు అంతా తానై వ్యవహరిస్తుంటారు. ఉద్యోగాలకు రాకపోయినా, విధులు నిర్వర్తించకపోయినా ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకుండా చూసుకునే బాధ్యతలను ఈ కీలక ఉద్యోగే చూస్తుంటారనే విమర్శలున్నాయి.

మోసాలు నా దృష్టికి వచ్చాయి



ఉద్యోగాల పేరిట ఆశావహుల నుంచి మా శాఖలోనే పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు డబ్బులు వసూలు చేస్తున్నారనే విషయం నా దృష్టికి వచ్చింది. మాకివలసలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జీవీ నరసింహం అనే కాంట్రాక్ట్ ఉద్యోగిపై ఆరోపణలు చేస్తూ ఓ బాధితురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి.. పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అలాగే మరో అమ్మాయి కూడా ఇంకో ఉద్యోగికి కూడా డబ్బులిచ్చేయడంతో పాటు నకిలీ ఆర్డర్‌ను కూడా తీసుకొచ్చేసిన ఘటన నా దృష్టికి వచ్చింది. ఇలాంటి వారిపై జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపడతాను. – డాక్టర్ బి.మీనాక్షి, డీఎంహెచ్ఓ